మానవత్వం పరిమళించిన వేళ

తూర్పు వాకిట వెలుగు పొడ సూపలేదు.

ఇంకా జనం నిద్రలోనే ఉన్నారు. అక్కడక్కడ "భౌ! భౌ!" మంటూ కుక్కలు మాత్రం అరుస్తూనే ఉన్నాయి.

వీధి తలుపు మీద 'టకటకా' కొట్టిన శబ్దానికి కోటమ్మ ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.

"ఎవరో తలుపు కొడుతున్నారు!" మొగుడు కిట్టయ్యను– "లే! లే!" అంటూ గట్టిగా కుదిపింది. అతను కళ్ళు తెరవకుండానె కదిలి అటు తిరిగి మళ్లీ పడుకున్నాడు.

అలా అర్ధరాత్రి, అపరాత్రి తలుపు కొట్టేది ఎవరో కోటమ్మకి బాగా తెలుసు.

భయంతో శరీరం వణికింది. అలా తలుపు మీద 'టక టక' శబ్దం అవుతూనే ఉంది. పోలీసులు లాఠీతో కొట్టే శబ్దమది. ఇక తలుపు తీయక తప్పదనుకున్న కోటమ్మ పాత పట్టెమంచం దిగి తలుపు వారగా పడుకున్న అత్తను సమీపించింది.

"అత్తమ్మా! ఆళ్ళు వచ్చినట్టున్నారు... లెగు!" అంది నెమ్మదిగా.

"ఏందిట?" ఎప్పుడో మెళకువ వచ్చినా పక్కమీద పడుకునే ఉన్న మల్లమ్మ-మెల్లిగా గొంతు తగ్గించి అడిగింది.

"తెల్వదు..!"

తలుపు మీద మరింత గట్టిగా శబ్దమయింది.

"తలుపు తియ్యే? ఏంది భయం!"" రావులమ్మ మరింత గొంతు తగ్గించి చెప్పింది.

"జరిగేదేదో జరుగుతుంది! తప్పించుకోలేం!" అనుకున్న కోటమ్మ లైటు వేసి తలుపు తీసింది.

"కిట్టయ్య ఎక్కడా..?" ఎదురుగా నిలబడ్డ ఎస్సై గద్దించాడు.

కోటమ్మకి నోరు పెగల్లేదు. ఉన్నాడంటే ఏ ప్రమాదమో, లేడంటే ఏ ప్రమాదమో తెలియలేదు.

"ఆడు పండుకుండు!" రావులమ్మ కోడలి వెనక నుంచే సమాధానమిచ్చింది.

"ఇదిగో ముసలీ! నీ మాట ఎవరు నమ్ముతారే? వెళ్లి వాడిని పిలుచుకురా? లేదా లాఠీ విరుగుతుంది జాగ్రత్త!"

కిట్టయ్యను లాఠీలతో చావకొట్టడం ఆ అత్తాకోడళ్లు ఎన్నోసార్లు చూశారు.

బాధతో మెలికలు తిరుగుతూ కిట్టయ్య పెట్టే ఆర్తనాదాలు వారి చెవుల్లో ఇంకా గింగురుమంటూనే ఉన్నాయి.

భయంతో అత్తా, కోడళ్ల శరీరాలు వణికాయి.

రావులమ్మ లోపలకి వెళ్లి కిట్టయ్యతో తిరిగి అక్కడకు వచ్చింది. కిట్టయ్యను చూడగానే క్రూరమృగంలా గర్జిస్తూ ఎస్సై అతని జుట్టు పట్టుకుని బయటకు లాక్కొచ్చాడు.

"ఏరా కిట్టిగా... ఆ పంతులు గారింట్లో దొంగతనం చేసింది నువ్వేనా? చెప్పురా?" అంటూ మోకాళ్ల మీద లాఠీతో బలంగా కొట్టాడు.

"నేనేరి కాద దొంగతనం సెయ్యలేదు బాబా! ఆ రాతిరి ఇంటికాడే ఉన్నా!" లాఠీ దెబ్బలతో మోకాళ్ళ చిప్ప పగులుతుంటే... భరించలేని బాధతో కిట్టయ్య మొత్తుకుంటూ చెప్పాడు.

"ఆడు ఇంటికాడే ఉన్నాడయ్యా! దొంగతనానికి పోనే లేదు బాబూ!" రావులమ్మ మళ్లీ మళ్లీ చెప్పింది.

"ఓ! ముసలీ! నీ మాట లెవరు నమ్ముతారే! నీ మొగుడో గజదొంగ! వాడి వెంట పోయి దొంగతనాలు చేసింది చాలక- కొడుకును కూడా దొంగగా తయారుచేశావు! నీ చరిత్ర ఎవరికి తెలియదే! ఎక్కువ వాక్క- నోరు మూసుకో!" ఎస్సై గద్దిస్తూ ఆమె మీదికి లాఠీ ఎత్తాడు.

ఈలోపు ఇద్దరు కానిస్టేబుళ్ళు అక్కడకి చేరుకున్నారు.

ఎస్సై చెప్పినట్టుగా ఇల్లంతా వెతికారు. కాని, ఎక్కడా వారికి ఏమీ దొరకలేదు.

'పాపం... వీడు దొంగతనం చెయ్యలేదేమో!' అనుకున్నారు వాళ్ళు. ఈసారి ఎస్సైకి కూడా కాస్త అనుమానమొచ్చింది.

"ఈడు దొంగతనం నిజంగా చెయ్యలేదా? పేరు మోసిన దొంగలంతా సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఈడొక్కడే బయట ఉన్నా వీడే దొంగతనం చేస్తే నగలేమైనట్టు?" ఎస్సై పదేపదే ఆలోచించాడు.

'స్టేషన్‌కి తీసుకెళ్లి తన్నితే, గాని అసలు సంగతి తెలీదు!' అనుకున్న ఎస్సై-

"ఆడిని స్టేషన్‌కు తీసుకురండి!" అనగానే కానిస్టేబుళ్ళు కిట్టయ్యను తీసుకెళ్లి స్టేషనులో కటకటాల వెనుకకు తోసి తాళంపెట్టారు.

కిట్టయ్య తండ్రి దొంగలముఠాలో ఉండి దొంగతనాలు చేసేవాడు.

ఆ చుట్టుపక్కల పేరు మోసిన దొంగల ముఠా అది. రావులమ్మ కూడా మొగనితో వెళ్లి దొంగతనాలు చేసేది.

వారితో పాటు ఎన్నోసార్లు లాఠీ దెబ్బలు తింది. జైలుశిక్షలు అనుభవించింది.

ఒక ఊరనక అలా తిరుగుతూనే ఉన్నారు.

కిట్టడు చిన్నతనంలోనే మొగడు రంగడు చనిపోవడంతో రావులమ్మకు బతకడమే కష్టమయింది. లాఠీ దెబ్బలతో పళ్ళు ఊడిపోయాయి. మోకాలి చిప్పలు పగిలిపోయాయి. కుంటుతూ నడుస్తుంటే అందరూ 'మంథర' అని పిలుస్తూ ఆమె వెంటపడి వేధించడం మొదలుపెట్టారు.

ఇంక అక్కడ ఉండలేని రావులమ్మ ఏం చెయ్యడానికీ తోచక దిక్కులేనిదానిలా ఆ పూరు వదిలి వచ్చేసింది.

కొత్త ఊరులో పొలాల్లో కూలిపని చేసుకుంటూ కిట్టయ్యని పెంచింది. వాడు దొంగ కాకుడదనుకుంది.

కాని, కిట్టడు ఎంత భయపెట్టినా చిన్నతనం నుంచి చిన్నచిన్న దొంగతనాలు చేస్తూనే ఉన్నాడు. వాడు దొంగలు ముఠాలో చేరలేదు.

వంటరి దొంగ కిట్టయ్యకు పెళ్ళయి కోటమ్మ కాపురానికొచ్చింది.

ఆమె కాస్త చదువుకుంది. పెళ్ళైన మొదటిరోజె కిట్టయ్య దొంగ అని ఆమె పసికట్టింది. రాత్రి వెళ్లి చీరలు, రవికలు, పంచెలు, దుప్పట్లు అలా ఏవేవో చేతికందినవి తెచ్చి ఇంట్లో పడేసేవాడు. మరునాడు అమ్మి డబ్బు తెచుకుని వచ్చేవాడు.

మధ్యలో బంగారు, వెండి నగలతో పాటు- డబ్బు కూడా తెచ్చి ముంతలో పెట్టి పెరట్లో గొయ్యి తీసి పాతేసేవాడు.

అతన్ని మార్చాలని కోటమ్మ ఎంతో ప్రయత్నించింది.

ఆమె మిషను కుట్టేది. చుట్టుపక్కల ఇళ్ళలో పాచిపనులు చేసేది. అందరికీ తలలో నాలుకలా ఉండేది.

క్రమంగా ఓ సొంత పాక సంపాదించుకోగలిగారు.

కిట్టయ్య రోజూ దొంగతనానికి వెళ్లకపోయినా అతను పోలీసుల దృష్టిలో దొంగే! వారి రికార్డులలో అతని పేరు ఉంది.

ఎన్నోసార్లు పట్టుబడి కిట్టయ్య పోలీసుల చేతుల్లో లాఠీ దెబ్బలు తిన్నాడు. జైలు శిక్షలూ అనుభవించాడు.

కిట్టయ్యకు ఓ కూతురు పుట్టింది.

కూతురు మీది ప్రేమతో కోటమ్మ బలవంతంతో కిట్టయ్య దొంగతనాలు తగ్గించాడు. అలవాటు పడిన చెయ్యి అప్పుడప్పుడు అర్ధరాత్రివేళ మంచం వదలి, ఇల్లు వదలి దొంగతనాలు చేస్తూనే ఉన్నాడు.

పోలీసుల లిస్టులో అతని పేరు మొదటే ఉంది.

తెల్లారి అత్తా, కోడలు పోలీసుస్టేషన్‌కి బయలుదేరి వెళ్లారు.

కిట్టయ్య కటకటాల గదిలో ఓ బల్లమీద పడుకుని ఉన్నాడు. తల్లిని, భార్యని చూడగానే లేచి కూర్చున్నాడు.

"అయ్యా! ఆడు ఏ దొంగతనం సెయ్యలేదు. ఆడు ఇంటికాడనే ఉన్నాడయ్యా! ఇదిగో ఈ సంటిదాని మీద ఒట్టయ్యా!" అంటూ ఎస్సైని ఎన్నోవిధాల బతిమాలింది తల్లి.

"ఇదిగో ముసలీ! పంతులుగారింట్లో పోయిన నగలు దొరకాలా! అప్పుడే ఈడిని వదిలేది!" ఎస్సై మాటలకి కోటమ్మ కంగారు పడింది.

రావులమ్మకి ఏం చెయ్యాలో తోచలేదు.

"కిట్టయ్య దొంగతనం సెయ్యలేదు. ఇంటికాడ పడుకునే ఉన్నాడు. ఆరింట పోయిన నగలు ఎట్టా తేగలడు?" కోటమ్మ, రావులమ్మలు ఆలోచిస్తూనే ఉన్నారు.

అంతలో... కంప్లైంటు ఇవ్వడానికి కూతుర్ని వెంటబెట్టుకుని పంతులుగారు అక్కడకు వచ్చారు. ఎస్సై చెప్పినట్టుగా పంతులుగారు కాగితం మీద రాసి సంతకం పెట్టారు.

"మీకు ఎవరి మీదైనా అనుమానమా?" ఎస్సై అడిగాడు.

"లేదు బాబూ!" పంతులుగారు సమాధానం చెప్పాడు.

"అయితే... దొంగలే వచ్చి ఉండాలి! మీ ఇంట్లో నగలు ఉన్నట్లు తెలిసి ఉంటుంది?" అన్నాడు ఎస్సై.

"తెలియడానికేముంది బాబూ! రేపు తెల్లవారితే ఈ అమ్మాయి వివాహం. ఇంట్లో ఉన్న పాత ఇత్తడి సామానంతా అమ్మి మంగళసూత్రాలు, బంగారు పుస్తెల తాడు, పెళ్ళికొడుక్కి ఉంగరం చేయించాము. మొత్తం 4 తులాల బంగారం! ఆ వస్తువులు లేకపోతే అమ్మాయి పెళ్ళే ఆగిపోతుంది. ఈ ఊళ్లో తలెత్తుకు తిరగలేము. ఈ పిల్ల, మేము ఆత్మహత్య చేసుకోవలసిందే? ఇంక ఏ గత్యంతరమూ లేదు బాబూ!" ఆయన కళ్ళు నీటితో నిండిపోయాయి. మాట తడబడింది.

ఆయన మాటలకి ఆయన కూతురు వైష్ణవి పమిటకొంగుతో కళ్ళొత్తుకుంది. అక్కడున్న వారందరూ కూడా అదే స్థితిలో ఉన్నారు.

"అంత మాటనకండి పంతులుగారూ! ఎక్కడున్నా దొంగని పట్టుకుని మీ నగలు మీకిప్పిస్తాం!" అన్నాడు ఓ కానిస్టేబులు.

"ఎంతోమంది పెళ్ళిళ్ళకు ఒకనాడు మంగళ సూత్రాలు చేయించి ఇచ్చాను. ఎన్నో దానాలు, ధర్మాలు చేశాను. పాము కాటుకు మందేసి పోయిన ప్రాణాలు తిరిగిపోశాను. ఏ పుణ్యమూ మమ్మల్ని ఆదుకోలేదు. ఏనాడు చేసిన పాపమో ఇది. ఏ పుణ్యమూ మావెంట రాలేదు. మీరే మమ్మల్ని కాపాడాలి!" అన్న పంతులుగారి మాటలు అందరినీ కలచివేశాయి.

ఆ మాటకి రావులమ్మ ఆయన్ని పరిశీలనగా చూసింది.

"సందేహం లేదు! ఆ పంతులుగారే! కిట్టయ్యను ఆనాడు పాము కాటేస్తే ఆ విషం తాను పుక్కిటపట్టి తన కొడుకును కాపాడిన దేవుడు ఆయనే!" ఎల్లమ్మ బాధతో ఉక్కిరిబిక్కిరయింది.

వెంటనే కొడుకు దగ్గరకు పరుగెత్తింది.

"ఒరే కిట్టయ్యా! ఇప్పటికైనా నిజం చెప్పరా? ఆ పంతులుగారు ఎవరో కాదు! నిన్ను పాముకాటు నుండి కాపాడిన దేవుడురా!" అంది రావులమ్మ వెక్కివెక్కి ఏడుస్తూ!

"ఓయమ్మా! నేసెప్పేది నిజమే? నీ మీద ఒట్టే... నేనే పాపం సెయ్యలేదే! నా బిడ్డ మీద ఒట్టే!" అన్నాడు బాధగా... అతని కళ్ళలో నీళ్లు నిలిచాయి.

"ఆరికి ఎంత కట్టం వచ్చినాదిరా? మరి ఎట్టాగరా? సెప్పరా?" అంటూ రావులమ్మ కొడుకును బతిమాలింది.

"నే సత్తె పెమాణం సేసి సెప్పుతున్నా! నాకు ఏ పాపం తెల్వదే? అయినా... ఓపని సేద్దారి... ఆయన పానం కాపాడుదారే? ఆయన పాణం గుటుక్కుమనకుండా సూద్దారే?" అన్నాడు కిట్టయ్య.

"మనం ఏటి సేగలంరా! అది బంగారమాయె!" అంది తల్లి.

"మం ఏటైనా సేయగలం! మన పానాలు కాపాడినాయన పానాలు మనం సూసుకోవాలి గందా! నావి కంటె కాసులు ఉన్నాయిగా! ఆటిని మార్చేసి ఏటేన సేద్దారి!" అంది కోటమ్మ.

"అట్టా సేద్దారి!" అంది ఎల్లమ్మ.

కిట్టయ్య ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.

తల్లి చంకలో ఉన్న చంటిపిల్ల బుగ్గల్ని రెండు చేతులతో తాకాడు. తాను కటకటాల్లో ఉన్న సంగతి మరచి చంటిదాన్ని ఎత్తుకున్నంత సంబరపడ్డాడు.

అత్తా, కోడలు అలా కిట్టయ్యతో మాటాడుతుంటే ఎస్సైకి చాలా కోపం వచ్చింది.

"ఏమిటా గుసగుసలు? ఏం జరుగుతోందక్కడ? నడవండి!" అంటూ హూంకరించాడు.

అత్తా, కోడలు వెనుదిరిగి పంతులుగారి పాదాల మీద పడ్డారు.

"పాము కాటు నుంచి మా కిట్టయ్యని కాపాడింది మీరే బాబూ! ఆడు మీ ఇంట దొంగతనం సెయ్యలేదు బాబూ! ఆ పని ఏరు సేసిండో తెల్వదు బాబూ!" అన్నారు.

"లెండి! లెండి! అంతా ఆ భగవంతుని లీల!" అంటూ ఆయన ఎస్సైవైపు తిరిగాడు.

"అస్తమించే పొద్దులా ఉన్నాను... నగలు దొరికితే పెళ్ళికి వచ్చి అక్షింతలు వేయండి. లేకపోతే అనాథ ప్రేతాలుగా దగ్గరుండి మా శవాలకు దహన సంస్కారాలు చేయించండి నాయనా!" అంటూ ఆయన వెనుదిరిగారు. ఆయన వెనకే కూతురు అడుగులేసింది.

పంతులుగారి మాటలకి అందరి హృదయాలూ బాధతో అల్లకల్లోలమయ్యాయి. అక్కడున్న వారందరూ ఒకరు చూడకుండా ఒకరు కళ్ళొత్తుకున్నారు.

కిట్టయ్య కళ్ళలో అయితే కన్నీళ్లు ధారలు కట్టాయి.

కోటమ్మ, రావులమ్మ తొందరగా ఇల్లు చేరుకున్నారు.

మరునాడు కూడా కిట్టయ్య కటకటాల్లోనే ఉన్నాడు. ఇబ్బందిగా, ఏమీ తోచనట్టు అటూఇటూ చూస్తున్నాడు.

అంతలో... సాయంకాలమయింది. పోలీసుస్టేషన్ పక్కన ఉన్న చెట్ల మీద పక్షులు కలకలారావాలు చేస్తున్నాయి. కిట్టయ్య మనస్సు తొందరపడుతోంది.

చీకటి నలుదిశలా ముంచుకొచ్చింది.

చీకటి అంటే అందరికీ భయమే! ఆ భయంతో అభయంలా లైట్లు వెలుగుతూ కాంతులు ప్రసరింపచేస్తున్నాయి.

ఆకాశంలో తారలు మేమున్నామంటూ ధగధగ మెరుస్తున్నాయి. ఆ వేళలో పంతులుగారు పోలీసుస్టేషనులో అడుగుపెట్టారు. ఆయన ముఖకాంతి చూడగానే ఎస్సైకి శుభసూచకంగా అనిపించింది.

"మా నగలు మాకు దొరికాయి! ఇవిగో!"

– అంటూ పంతులుగారు చేతిలో ఉన్న నగల మూట ఎస్సై కూర్చున్న టేబులు ముందు పెట్టాడు.

ఎస్సై ఆ నగలు చూసి ఆశ్చర్యపోయాడు. మొదలే కాని, తుదలు లేని ఆ కేసు అలా సెటిల్ అవుతుందని ఎవరూ ఊహించకోలేకపోయారు.

"ఎలా దొరికాయండీ?" ఆ నగలు చేత్తో తీసి చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు.

"కిట్టయ్య ఇక్కడే ఉన్నాడు... అక్కడ నగలు దొరికాయి. కేసు అంత పట్టలేదు. ఆరోజు ఈ నగలు పెట్టిన పెట్టె అర్ధరాత్రి పెరటిలోకి పట్టుకుపోయి పెట్టె పగులగొట్టి నగలు దోచుకున్నారు. విరిగిన ఆ పెట్టె ముక్కలు ఇంకా అక్కడే ఉన్నాయి. ఈరోజు.., ఇప్పుడే ఈ చీకటిలో ఈ మూట మా సావడిలో ఓ మూల పడుంది బాబూ! అది కూడా మా అమ్మాయి కంటపడింది. మా నగలు మాకు దొరికాయి. ఆ కిట్టయ్యని ఇంక వదిలేయండి బాబూ! తెల్లారితే అమ్మాయి పెళ్ళి. ఇవేమీ చూసుకోలేదు. మీరందరూ తప్పకుండా రావాలి... కిట్టయ్య దొంగ కాదు..." అంటూ ఆయన త్వరత్వరగా వెళ్లిపోయాడు.

అంతలో... కోటమ్మ, ఎల్లమ్మ అక్కడకు చేరుకున్నారు. కోటమ్మ మెడ కంటి కాసులు లేక బోసిపోయి ఉంది. కోటమ్మను చూడగానే కిట్టయ్యకు అంతా అర్థమయింది.

"కంటి కాసులు అమ్మి, ఆరి నగలు కొని పసుపు బట్టలో మూటకట్టి వారి ఇంటికాడ పెట్టొచ్చినాం!" అన్నారు అత్తా కోడలు.

కిట్టయ్య మనస్సు కుదుటపడింది. తాను ఆ ఇంట్లో దొంగతనం సేయకపోయినా ఆరిని కాపాడాను అనుకున్నాడు కిట్టయ్య.

ఎస్సై కిట్టయ్యని విడిపించాడు.

"మరెప్పుడూ ఇటు రాబోకురా!" అంటూ మందలించాడు.

కిట్టయ్య ఓ మనిషే! మానవత్వం పరిమళించిన వేళ ఆనందం వెల్లి విరుస్తుంది. కిట్టయ్య- తల్లి, పెళ్ళాం వెంట తృప్తిగా పంతులుగారింట్లో పెళ్ళికి బయలుదేరారు.

-'ఆంధ్రప్రభ' ఆదివారం... 8 డిసెంబర్, 2002